సాక్షి నిజామాబాద్

మంగళవారం । 25 । జూన్ । 2024



గనులను కేటాయించాలి

బొగ్గు గనుల ప్రైవేటీకరణను మానుకొని సింగరేణికి గనులను కేటాయించాలని సీపీఎం నేతలు డిమాండ్‌ చేశారు.

- 8లో ▸



వినతుల వెల్లువ

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 164 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు వినతులు స్వీకరించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /25.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్‌

పింఛన్‌ ఇప్పించాలని అంధుల వినతి



సుభాష్‌నగర్‌: నగర శివారులోని బోర్గాం (పి) గ్రామానికి చెందిన గుట్టమీది వెంకవ్వ అంధులైన కవలలు అఖిల్‌, నిఖితతో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకవ్వ మాట్లాడుతూ ఆరునెలలుగా పింఛన్‌ కోసం తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అఖిల్‌, నిఖితల తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందారని, ఇద్దరూ అంధులు కావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా పింఛన్‌ ఇప్పించాలని వారు కోరారు. ప్రభుత్వం కొత్త పింఛన్ల సైట్‌ ఓపెన్‌ కాగానే అందిస్తామని డీఆర్‌డీఏ అధికారులు హామీనిచ్చారు.

సెలవులో వెళ్లిన కలెక్టర్‌

సుభాష్‌నగర్‌: కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు వ్యక్తిగత సెలవులో వెళ్లారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు సెలవులో ఉన్నట్లు సమాచారం. ఆయన తిరిగి విధుల్లో చేరే వరకూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ అంకిత్‌కు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో 2025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్‌ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 202 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1058.30 అడుగుల(9.05టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

నేడు ముగియనున్న పాలిసెట్‌ కౌన్సెలింగ్‌

నిజామాబాద్‌అర్బన్‌: పాలిసెట్‌ మొదటి విడత కౌన్సెలింగ్‌ సోమవారం కొనసాగింది. ఇందులో 415 మంది విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టినట్లు కౌన్సెలింగ్‌ సమన్వయకర్త శ్రీరాంకుమార్‌ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారంతో ముగుస్తుందని పేర్కొన్నారు. అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు వెబ్‌ ఆప్షన్‌ నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 27వ తేదీ వరకు వెబ్‌ ఆప్షన్‌ నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

పోచారంను ప్రజలు క్షమించరు

సాక్షి, కామారెడ్డి: నమ్మిన పార్టీని, నమ్ముకున్న బాన్సువాడ ప్రజలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మోసం చేశారని బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్‌, గంప గోవర్ధన్‌, జాజాల సురేందర్‌, హన్మంత్‌ సింధే విమర్శించారు. సోమవారం కామారెడ్డిలోని గంప గోవర్ధన్‌ నివాసంలో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, పోచారం పార్టీ మారడం తదితర పరిణామాలపై చర్చించారు. అనంతరం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సీనియర్‌ నాయకుడిగా గుర్తించి 2014 లో వ్యవసాయ శాఖ మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని, 2018 లో శాసనసభ స్పీకర్‌ చేశారని గుర్తు చేశారు. అలాంటి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, వారికి ఎలాంటి ఆపద వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా తామందరం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మంత్రుల చెంతకు బాన్సువాడ పంచాయితీ

బాన్సువాడ: బాన్సువాడ రాజకీయపంచాయితీ హైదరాబాద్‌కు చేరింది. ఎమ్మెల్యే పోచారం ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆయన చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్‌ నేతలు సోమవారం హైదరాబాద్‌ వెళ్లారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్ర భుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలను కలిసి తమ గోడు వినిపించారు. పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికే అప్పగించాలని కోరారు.



వెన్నెల వెలుగులు

నిండు వెన్నెలను కనులారా వీక్షిస్తే కలిగే ఆ మధురానుభూతి మాటల్లో వర్ణించలేనిది. ఇందూరు నగరంలో సోమవారం రాత్రి వెన్నెల వెలుగులు చూపరులను ఆకట్టుకున్నాయి. చంద్రుడు నిండుగా కనువిందు చేయడంతో నగరవాసులు ఆసక్తిగా తిలకించారు.
– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

హద్దుల్లేని మైనింగ్‌

- 70 వేల క్యూబిక్‌ మీటర్ల అనుమతితో 7లక్షల క్యూబిక్‌ మీటర్ల మెటల్‌ తవ్వకం
- మరోవైపు ప్రభుత్వ భూమిలో అక్రమంగా స్టోన్‌ క్రషర్‌ నిర్వహణ
- విద్యుత్‌ సరఫరా అక్రమ మార్గంలోనే..
- చర్యలు తీసుకోవడంలో సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం



లక్ష్మాపూర్‌ క్వారీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్‌ గ్రామ సమీపంలోని మెటల్‌ క్వారీలో అనుమతులకు మించి అనేక రెట్లు అధికంగా తవ్వకాలు చేస్తున్నారు. భారీ పేలుళ్ల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో బోరుబావులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా క్రషర్‌ నిర్వహిస్తున్నారు. అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాలతో పలువురు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

■ లక్ష్మాపూర్‌ వద్ద ఎలాంటి పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే 10 ఎకరాల్లో మెటల్‌ క్వారీని ప్రభుత్వం నుంచి లీజు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఈ క్వారీలో 70 వేల క్యూబిక్‌ మీటర్ల మెటల్‌ తవ్వేందుకు నిర్వాహకులు 2015లో అనుమతులు తీసుకున్నారు. అయితే అనుమతులకు మించి సుమారు 7 లక్షలకు పైగా క్యూబిక్‌ మీటర్ల మేర మెటల్‌ను తవ్వేశారు. మెటల్‌ తవ్వే క్రమంలో వచ్చే భారీ పేలుళ్లతో చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతుల బోరుబావులు, ఇళ్లలో బోర్లు దెబ్బతింటున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన గనుల శాఖ తనకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. ఇదిలా ఉండగా క్వారీ నిర్వాహకులు కాలుష్య నియంత్రణ విభాగం నుంచి సైతం అనుమతులు లేకుండా పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ తవ్వకాలకు సంబంధించి ఈటీఎస్‌ (ఎలక్ట్రానిక్‌ టోటల్‌ స్టేషన్‌) సర్వే చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు చేయించకపోవడం గమనార్హం.

ప్రభుత్వ భూమిలో క్రషర్‌..

మెటర్‌ క్వారీ ప్రాంతంలోనే ప్రభుత్వ భూమిలో అక్రమంగా స్టోన్‌ క్రషర్‌ యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ 826, 330, 311 సర్వే నంబర్లలో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో క్రషర్‌ నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిలో క్రషర్‌ ఏర్పాటు చేయకూడదు. ఇందుకు సంబంధించి సైతం 2021 మే 11న జక్రాన్‌పల్లి తహసీల్దార్‌ కార్యాలయం అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా ఇచ్చిన వివరాల్లో స్పష్టంగా ఉంది. 2018లో రెండుసార్లు రెవెన్యూ అధికారులు సర్వే సైతం చేయించారు. ఈ సర్వేలో క్రషర్‌ ఉన్న భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని తేలింది. అయినప్పటికీ చర్యలు తీసుకునే విషయంలో రెవెన్యూ యంత్రాంగం కనీస ఆలోచన చేయకపోవడం గమనార్హం. కేవలం రెండుసార్లు నోటీసులు ఇచ్చి వదిలేయడం విశేషం. క్రషర్‌ ఏర్పాటుకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. ప్రైవేటు పట్టా భూమిలో 'నాలా' కన్వర్షన్‌ అనుమతులు తీసుకుని, అన్నిరకాల పర్యావరణ అనుమతులతో క్రషర్‌ నిర్మించాలి. అయితే ఇక్కడ మాత్రం ఏకంగా ప్రభుత్వ భూమినే అక్రమించి క్రషర్‌ ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు అన్నీ తెలిసినప్పటికీ చర్యలు తీసుకునే విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

- జూనియర్‌ డాక్టర్ల అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్‌
- జూడాల సమ్మె ప్రారంభం
- విధులు బహిష్కరించి నిరసన

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే పోరాటం ఆగదని జూనియర్‌ డాక్టర్ల అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్‌ అన్నారు. సోమవారం ప్రారంభించిన నిరవధిక సమ్మెలో సుమారు 300 మంది పాల్గొన్నారు. సోమవారం ఉదయం విధులు బహిష్కరించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగంలో పనిచేసే జూనియర్‌ డాక్టర్లకు సమ్మె నుంచి మినహాయింపు ఇచ్చామన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే సమ్మెకు దిగామని తెలిపారు. తమకు ప్రతినెలా స్టైఫండ్‌ నిధులు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.



జిల్లా కేంద్రంలోని జనరల్‌ ఆస్పత్రి ఎదుట సమ్మెలో పాల్గొన్న జూనియర్‌ డాక్టర్లు

డిమాండ్లను పరిష్కరించాలి



మా డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. గత ప్రభుత్వానికి సైతం పలుమార్లు మా సమస్యలను విన్నవించాం. ఇదిగో, అదిగో అంటు కాలం వెళ్లదీశారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

– సురేష్‌ నీరుడి, జూనియర్‌ డాక్టర్ల అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

స్టైఫండ్‌ ప్రతినెలా ఇవ్వాలి



జూనియర్‌ డాక్టర్లకు స్టైఫండ్‌ రాక నానా ఇబ్బందులు పడుతున్నాం. నెలల తరబడిగా ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. రోగులకు సేవలందిస్తున్న మాకు సకాలంలో స్టైఫండ్‌ ఇస్తే బాగుంటుంది. ప్రభుత్వం తమ ఏడు డిమాండ్లను పరిష్కరిస్తే సమ్మె విరమిస్తాం.

– చంద్రకాంత్‌, జూనియర్‌ డాక్టర్ల అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు

గుర్తింపు ఇవ్వాలి



రోగులకు మెరుగైన సేవలు అందించడ కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. బాధ్యతయుంగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత ప్రభుత్వం మాకు అన్యాయం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం అయినా మా డిమాండ్లను నెరవేర్చాలి. పని చేస్తున్నందుకు తగిన గుర్తింపు ఇవ్వాలి.

– డాక్టర్‌ హరితకృష్ణ, జూనియర్‌ డాక్టర్‌

ప్రభుత్వం న్యాయం చేయాలి



ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి. అత్యవసర సేవల విషయంలో ఇబ్బందులు రాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నాం. మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. తగిన ఫలితం ఉంటే మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించగలుగుతాం.

– స్టెఫీ దాలర్‌, జూనియర్‌ డాక్టర్‌

విద్యుత్‌ లైన్‌మన్‌పై దాడి

నిజామాబాద్‌ నాగారం: కరెంట్‌ బిల్లు కట్టమన్న లైన్‌మన్‌పై ఓ వ్యక్తి అనుచరులతో కలిసి దాడి చేశాడు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. దుబ్బ సెక్షన్‌లో విధులు నిర్వహించే ఓ లైన్‌మన్‌ సెక్షన్‌ పరిధిలోని ఓ వ్యక్తిని పెండింగ్‌ బిల్లు కట్టమని కోరాడు. దీంతో ఆయన బిల్లు కట్టకపోగా లైన్‌మన్‌తో గొడవ పడ్డాడు. అనంతరం తన మిత్రుడు కార్పొరేటర్‌ను పిలిపించుకొని, అనుచరులతో నగరంలోని దుబ్బ సెక్షన్‌ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ కార్పొరేటర్‌, అతడి అనుచరులు లైన్‌మన్‌పై దాడి చేశారు. అక్కడే సబ్‌ఇంజనీర్‌, ఇతర ఉద్యోగులు ఉన్న భయంతో మౌనంగా ఉండిపోయారు. ఈ విషయాన్ని బాధిత లైన్‌మన్‌ తోటి ఉద్యోగులకు చెప్పినా అందరు మౌనంగా ఉండిపోయారు. ఒక వేళ ఫిర్యాదు చేస్తే మళ్లీ దాడి చేస్తారని భయంతో ఎవరికి ఫిర్యాదు చేయలేదు. కాగా ఈ ఘటనపై యూనియన్‌ నాయకులు, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మాక్లూర్‌ విండో అక్రమాలపై విచారణ

మాక్లూర్‌: మాక్లూర్‌ వ్యవసాయ పరపతి సంఘంలో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరగడంతో సోమవారం అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌, బాల్కొండ క్లస్టర్‌ అధికారి రమావతి కొత్తూర్‌ విచారణ చేపట్టారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 2న 'రూ. 70 లక్షల ఎరువులు మింగేశారు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు విచారణ అధికారిణిని నియమించారు. ఆమె సోమవారం మాక్లూర్‌ సొసైటీలో విచారణ నిర్వహించారు. ఎరువులకు సంబంధించి రూ. 70.50 లక్షల్లో ఇప్పటికే రూ. 10 లక్షల వరకు వసూలు చేశామని.. మిగతా సొమ్ము కూడా అతిత్వరలో రాబడతామని కార్యదర్శి సంతోష్‌ తెలిపారు. ఇదిలా ఉండగా మాదాపూర్‌, బొంకన్‌పల్లి గోదాంలు నిర్మించకుండానే నిర్మించినట్లు పుస్తకాల్లో రాసి రూ. 45 లక్షలు డ్రాచేసిన వైనాన్ని చూసి విచారణ అధికారిణి ఆశ్చర్యపోయారు. అంతే కాకుండా ఒక్క పంట సీజన్‌ ఖర్చు రూ. 43 లక్షలుగా రాశారు. బంగారం పెట్టుకుని రైతులకు రుణాలు ఇచ్చినట్లు ఉన్నా.. అక్కడ




బంగారం లేదు. ప్రాథమికంగా చూస్తేనే ఇంత భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. లోతుగా విచారిస్తే మరిన్ని అక్రమాలు బయటపడతాయని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ మరింత పకడ్బందీగా నిర్వహించామని విచారణాధికారిణి తెలిపారు.

కల్లెడి గ్రామానికి చెందిన మేడిపల్లి సుధాకర్‌ అనే రైతు హౌసింగ్‌ లోన్‌ తీసుకున్నాడు. ఏప్రిల్‌లో రూ. 83 వేలు, నవంబర్‌లో 83 వేలు తిరిగి చెల్లించాడు. కానీ కార్యదర్శి సంతోష్‌ వాటిని జమ చేసినట్లు చూపించలేదు. ఇలాంటి అక్రమాలు సైతం సొసైటీలో జరిగినట్లు విచారణలో తేలింది.

కాంగ్రెస్‌ అగ్రనేతలను కలిసిన పోచారం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, జనరల్‌ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌, పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీలను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీలోని అక్బర్‌ రోడ్డులో గల ఏఐసీసీ కార్యాలయంలో అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పోచారంను నేతలకు పరిచయం చేశారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను పోచారం సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌ రెడ్డి, రాజీవ్‌ రెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌ అగ్ర నేతలు మల్లికార్జున్‌ ఖర్గే, రాహుల్‌ గాంధీతో రేవంత్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అయితే మాకేంటి..?

- బాధ్యతారాహిత్యంగా పుస్తకాల గోదాం సిబ్బంది వ్యవహారం
- పాఠ్య పుస్తకాలను రిసీవ్‌ చేసుకోకుండా నిర్లక్ష్యం
- రాత్రంతా రోడ్డుపైనే రెండు లారీలు
- మెమోలు జారీచేసిన అధికారులు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా విద్యాశాఖకు చెందిన పుస్తకాల గోదాం సిబ్బంది నిర్లక్ష్య వైఖరి రోజురోజుకు పెరుగుతోంది. విధులు నిర్వహించే సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. ఇది ఎంతవరకూ వెళ్లిందంటే ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం ఖాతరు చేయడం లేదు. దీంతో పాఠ్యపుస్తకాల సరఫరా గాడితప్పింది. జిల్లా విద్యాశాఖ అధికారులు హెచ్చరించినా మార్పు రావడం లేదు. ఇటీవల జరిగిన ఓ సంఘటనే ఇందుకు నిదర్శనం. ఈ అంశంలో రాష్ట్రస్థాయి అధికారులు సైతం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విధులు సక్రమంగా నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మెమోలు కూడా జారీ చేశారు.

అసలేం జరిగిందంటే..

ఈ ఏడాది విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ముందస్తుగానే పుస్తకాలను జిల్లాలకు సరఫరా చేసింది. అయితే 20 రోజుల క్రితం జిల్లాకు రెండు లారీల పుస్తకాలను పంపించింది. లారీలు రాత్రి 10 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వీటిని రిసీవ్‌ చేసుకుని గోదాంలో భద్రపరచాల్సి ఉండగా.. గోదాంలో విధులు నిర్వర్తించే సిబ్బంది, అధికారులు పుస్తకాలను రిసీవ్‌ చేసుకునేందుకు నిరాకరించారు. ఈ సమయంలో తాము తీసుకోబోమని తేల్చి చెప్పారు. లారీ డ్రైవర్లపై మండిపడ్డారు. దీంతో వారు హైదరాబాద్‌లోని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం అందించారు. డీఈవో గోదాం సిబ్బందికి ఫోన్‌ చేసినా వారు స్పందించలేదు. చివరకు ఆర్‌వీఎం అధికారులు ఈ పుస్తకాలను రిసీవ్‌ చేసుకుని గూపన్‌పల్లిలోని మరో పాఠశాలలో భద్రపరిచారు. అయితే పుస్తకాలను రిసీవ్‌ చేసుకున్నట్లు గోదాంలోని పాఠ్య పుస్తకాల ఇన్‌చార్జి సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ ఆర్‌వీఎం అధికారుల సంతకం ఉండడంపై రాష్ట్ర అధికారులు ఆరా తీశారు. గోదాం సిబ్బంది స్పందించకపోవడంతో ఆర్‌వీఎం అధికారులు పుస్తకాలను రిసీవ్‌ చేసుకున్నారని జిల్లా అధికారులు సమాధానం ఇచ్చారు. రాష్ట్ర అధికారుల ఆదేశాలతో డీఈవో గోదాంలో పనిచేసే ఇద్దరు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. అంతేకాకుండా పుస్తకాలను వివిధ మండలాలకు సరఫరా చేసే క్రమంలో సైతం సదరు సిబ్బంది పనివారు లేరంటూ 15 రోజుల వరకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడంలో చేతులెత్తేశారు. చివరకు డీఈవో ఆగ్రహం వ్యక్తం చేయడంతో పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. అలాగే పాఠ్యపుస్తకాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా వాటి వివరాలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో నమోదు చేయలేదు. అంతేకాకుండా సమయ పాలన కూడా పాటించడంలేదని సమాచారం. ఉదయం కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పుస్తకాల సరఫరా వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మెమోలు జారీ చేశాం

పుస్తకాల గోదాం సిబ్బంది పాఠ్యపుస్తకాలను తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఇద్దరు ఉద్యోగులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెమోలు జారీ చేశాం. వారి నుంచి వివరణ కూడా తీసుకున్నాం. మరోసారి బాధ్యత రహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం.

– దుర్గాప్రసాద్‌, డీఈవో

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని హాస్టల్స్‌ చీఫ్‌ వార్డెన్‌ మహేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం క్యాంపస్‌లోని ఓల్డ్‌ బాయ్స్‌, న్యూ బాయ్స్‌, గర్ల్స్‌ హాస్టల్స్‌ను వార్డెన్లతో కలిసి చీఫ్‌ వార్డెన్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌ కేర్‌టేకర్స్‌, వంట మనుషులు, వర్కర్లు, మెస్‌ కమిటీ మెంబర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజిస్ట్రార్‌ యాదగిరి ఆదేశాల మేరకు హాస్టల్స్‌ను తనిఖీ చేశామన్నారు. గత శుక్రవారం బాలికల హాస్టల్‌లో అల్పాహారంలో కీటకం వచ్చిన విషయం తెలిసిందేనన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. హాస్టల్స్‌ సిబ్బంది మెస్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తాజా కూరగాయలు, సరుకులను వంటకు ఉపయోగించి రుచితో పాటు నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్‌ వార్డెన్లు కిరణ్మయి, కిరణ్‌రాథోడ్‌, గంగాకిషన్‌, కేర్‌టేకర్లు జమున, డిగంబర్‌ చౌహాన్‌, క్రాంతికుమార్‌, గ్రోసరీ, వెజిటబుల్స్‌ సప్లయర్స్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్‌ వార్డెన్‌ మహేందర్‌రెడ్డి

క్లుప్తంగా

సిద్దరామగౌడ్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి సిద్దరామగౌడ్ పీహెచ్‌డీ సాధించారు. తెయూ అధ్యాపకుడు డాక్టర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో సిద్దరామగౌడ్ పరిశోధన గ్రంథం సమర్పించారు. సోమవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో జరిగిన ఓపెన్ వైవావోస్‌కు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వద్దె రవీందర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి వాసం చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ సీహెచ్.ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, అధ్యాపకులు బి శిరీష, సత్యనారాయణరెడ్డి, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు. డాక్టరేట్ సాధించిన సిద్దరామగౌడ్‌ను తెయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: న్యాయ పరిపాలనలో ఉచిత శిక్షణ కోసం షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. బార్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థికి నెలకు రూ.మూడు వేలు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని దరఖాస్తు పత్రాలను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల య్యాయి. ఈ పరీక్షల్లో జిల్లాలో మొదటి సంవత్సరంలో 58.39 శాతం, రెండో సంవత్సరంలో 54.11శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఫస్టియర్ జనరల్‌లో 10,270 మంది విద్యార్థులకు 5,997 మంది పాసయ్యారు. సెకండియర్ జనరల్‌లో 6,074 మంది పరీక్ష రాయగా 3,287 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 1,159 మంది విద్యార్థులు హాజరుకాగా 562 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 978 మంది విద్యార్థులకు 441 మంది పాసయ్యారు.

వినతుల వెల్లువ

- ప్రజావాణిలో 164 ఫిర్యాదులు నమోదు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, అధికారులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 164 ఫిర్యాదులు అందాయి. కాగా దరఖాస్తులు అందజేసేందుకు భారీ సంఖ్యలో ఫిర్యాదుదారులు తరలివచ్చారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, డీఆర్డీవో సాయాగౌడ్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, నిధులను వెంటనే రికవరీ చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి కర్క గణేశ్ మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్‌లో జరిగిన అవినీతిపై గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, ఆరోపణలు ఉన్న జీఎస్‌డీవో శశికళను విచారణ అధికారిగా నియమించడం దారుణమన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా 11 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించి, రూ.లక్షల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. 4వ తరగతి సిబ్బందిని ఇంటి పనులకు కేటాయిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. శశికళతో పాటు హెచ్‌డబ్ల్యూ మారుతిపై విచారణ చేపట్టాలని కోరారు. నాయకులు ఎస్‌కే అషూర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సక్రమంగా చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న రమేశ్‌బాబు

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ బకాయిలు కాంట్రాక్టర్ చెల్లించడం లేదని, ప్రతినెలా వేతనాలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. వేతనాలు చెల్లించాలని అడిగితే ఏడాదిగా తమకు బిల్లులు రావడం లేదని, అందుకే జీతాలు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు సమాధానమిస్తున్నారని ఆరోపించారు. యూనియన్ నాయకులు గణేశ్, కార్తీక్, సందీప్, ప్రవీణ్, బుచ్చన్న, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా



జిల్లాలోని గ్రామపంచాయతీ, మున్సిపల్, బీవోసీ, హమాలీ, కేజీబీవీ, బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి భూమన్న, ఉపాధ్యక్షుడు శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు ఇచ్చేలా జీవో అమల్జేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. బీడీ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తానన్న రూ.4వేల పింఛన్ ఆంక్షల్లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ ఖాజా మొయినుద్దీన్, శివకుమార్, జేపీ గంగాధర్, పద్మ, అబ్దుల్, పోశెట్టి, సుప్రియ, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

సమయానికి రాని టీచర్!



పాఠశాల ముందు కూర్చున్న విద్యార్థులు

పెద్దకొడప్‌గల్: మండలంలోని విఠల్‌వాడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఐదో తరగతి వరకు 38 మంది విద్యార్థులు చదువుండగా ఒకరే టీచర్ ఉన్నారు. పాఠశాల భవనానికి మరమ్మతులు చేస్తుండటంతో పంచాయతీ కార్యాలయంలో పాఠాలు చెబుతున్నారు. అయితే సోమవారం ఉదయం 10:45 గంటల వరకు కూడా ఉపాధ్యాయురాలు రాకపోవడంతో విద్యార్థులు బయటే నిరీక్షించారు.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: డీసెట్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10న ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. డీఎడ్, డీపీఎస్‌సీ కోర్సులలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వివరాలకు 6309535759 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అజ్మీర రాంజీ మృతిపై సంతాపం



నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్, ఉద్యోగులు

సుభాష్‌నగర్: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర రాంజీ నాయక్ అకాల మరణం చెందడంపై ఎంప్లాయీస్ జేఏసీ, టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంతాపం వ్యక్తం చేసింది. అజ్మీర రాంజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అజ్మీర రాంజీ అందించిన సేవలను కొనియాడారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్, పోల శ్రీనివాస్, బీఎల్ శంకర్, దినేష్ బాబు, జాకీర్ హుస్సేన్, సంజీవయ్య, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి గొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి గనులను కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం అఖిల భారత కమిటీ నాయకులు బి వెంకట్

ఖలీల్‌వాడి: బొగ్గు గనుల ప్రైవేటీకరణను మానుకొని సింగరేణికి గనులను కేటాయించాలని సీపీఎం అఖిల భారత కమిటీ నాయకులు బి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సింగరేణిని నష్టాల బాటలోకి నెట్టడానికి సింగరేణికి బొగ్గు గనులను కేటాయించడం లేదన్నారు. ఓపెన్ టెండర్లలో సింగరేణి కూడా పాల్గొనాలని చెప్పడం అంటే ఉద్దేశపూర్వకంగా ప్రైవేటీకరణ వైపు ఆలోచించటమే అవుతుందన్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రాంతానికి తేవాల్సిందిపోయి కార్పొరేట్ కంపెనీలకు సహజ వనరులను కట్టబెట్టడం సరైంది కాదన్నారు. వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు రావడం, విద్యుత్ కొరత లేకపోవడానికి సింగరేణి లాంటి బొగ్గు గనులే కారణమన్నారు. సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం ఆదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని ఆరోపించారు. దీని మూలంగా వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెట్టాల్సి వచ్చిందన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేలాన్ని నిరసిస్తూ 28, 29 తేదీల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపు నిచ్చినట్లు తెలిపారు. ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ద వెంకట రాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో హైదరాబాద్

- దివ్యాంగులు, ఆసరా పింఛన్ లబ్ధిదారులు తరలిరావాలి
- వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి పిలుపు



సుజాత సూర్యవంశి

బోధన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు, ఆసరా పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పెంచుతామని కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీల అమలు కోసం మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టామని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి తెలిపారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగులు, ఆసరా పింఛన్ లబ్ధిదారులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రాంతంలో గల ప్రెస్ క్లబ్ వద్దకు ఉదయం 10 గంటల వరకు చేరుకోవాలన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ. 4 వేల నుంచి రూ. 6 వేలు, వృద్ధులు , వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులకు రూ.2 వేల నుంచి రూ. 4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలల కాలం గడిచిపోయినా ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. పెంచుతామని ఇచ్చిన మాట ప్రకారం గడిచిన డిసెంబర్ నెల నుంచే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ వెంటనే ఇవ్వాల్సిందేనని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చిన ఏకైక నాయకుడు వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అని పేర్కొన్నారు.

ఢిల్లీలో రేవంత్‌ను కలిసిన భాస్కర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎం.రాజీవ్‌రెడ్డి ఉన్నారు.

27న స్పోర్ట్స్ స్కూల్‌కు జిల్లాస్థాయి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 27న జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతిలో అడ్మిషన్ పొందటానికి నగరంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 9గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, లేటెస్ట్ ఫొటోలు, మూడో తరగతి ప్రొగ్రెస్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని హాజరు కావాలని సూచించారు.

సౌదీలో మాచారెడ్డి వాసి మృతి



మాచారెడ్డి: మాచారెడ్డికి చెందిన సుతారి ప్రభాకర్ (45) ఆదివారం రాత్రి సౌదీలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇక్కడ ఉపాధి కరువై అప్పుజేసి పది రోజుల కిందట సౌదీ వెళ్లిన ప్రభాకర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మ గుట్టలో పోలీస్‌లైన్ మార్గంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల వరకు ఉంటుందని ఎస్సై సంజీవ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 87126 59840, 87126 59719 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని 8 మేకలు మృతి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్ తండా వద్ద సిమెంట్ లారీ ఢీకొని ఎనిమిది మేకలు మృతి చెందాయి. బాన్సువాడ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న లారీ గాంధీనగర్ తండా వద్ద రోడ్డు దాటుతున్న మేకల మందను ఢీకొంది. తండాకు చెందిన లక్ష్మణ్ మేకలు చనిపోయాయి.

బోరు మోటార్ల చోరీ

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి రైతులకు చెందిన బోరు మోటార్లు, కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆదివారం దొంగలు అలీసాగర్ ఎత్తిపోతల కాల్వలో వేసిన మోటార్లు, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ డైరెక్టర్ అబ్దుల్ మౌలానా తెలిపారు. నవీపేట్ మండలం కోస్లీ శివారులో తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన 8 మంది రైతుల మోటార్లు, కేబుల్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. నవీపేట్, రెంజల్ ఎస్సైలు సోమవారం సాయంత్రం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఇసుక నిల్వలు సీజ్

రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచరం మేరకు సోమవారం పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. కందకుర్తి గోదావరి నుంచి అక్రమంగా రవాణా చేసి పంటపొలాల్లో నిల్వ చేసిన సుమారు 1000 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

బోధన్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. సోమవారం బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి: మండలంలోని జానకంపేట శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సోమవారం తెల్లవారుజామున ఎస్సై వంశీకృష్ణారెడ్డి పట్టుకున్నారు. వివరాలు.. బోధన్ మండలం కొప్పర్గ మంజీర నుంచి అక్రమంగా ఇసుకను మూడు టిప్పర్లలో ఎడపల్లి మండలం మీదుగా నిజామాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై దాడి చేసి టిప్పర్లను పట్టుకున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి శివారు ఎడ్లకట్లవాగు సమీపంలో సోమవారం ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. గ్రామం నుంచి మండల కేంద్రానికి వస్తున్న లారీ మలుపు వద్ద రోడ్డు కిందకు వెళ్లి పడిపోగా అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ

నందిపేట్: నందిపేటలో రవాణా శాఖ అధికారులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నాలుగు ప్రైవేట్ స్కూల్ బస్సులను, రెండు గూడ్స్ వాహనాలు, ఒక ట్రాలీ ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మండల కేంద్రానికి చెందిన నాలుగు ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ లేదని, అనుభవం లేని డ్రైవర్లతో నడుపుతుండటంతో సీజ్ చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి తెలిపారు. ఆర్టీఏ సిబ్బంది మనోజ్, దశరథ్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య



రాములు(ఫైల్)

నాగిరెడ్డిపేట: ఆర్థిక ఇబ్బందులతో నాగిరెడ్డిపేట మండలం మాసాన్‌పల్లి గ్రామపంచాయతీలో వాటర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న నాయికోటి రాములు(58) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజు కథనం ప్రకారం.. రాములు వాటర్‌మన్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న ఆయన ఆదివారం ఇంటివద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం కామారెడ్డికి, అక్కడి నుంచి సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు రాములు ఆరోగ్య పరిస్థితిపై నమ్మకం లేదని తెలపడంతో ఇంటికి తీసుకొస్తుండగా మాసాన్‌పల్లి శివారులోకి ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తున్కిపల్లిలో యువకుడు..



జ్ఞానేశ్వర్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం తున్కిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి జ్ఞానేశ్వర్(25) సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కుమ్మరి శివరాణి, విఠల్ దంపతుల కుమారుడు జ్ఞానేశ్వర్‌కు మార్చి 29న మెదక్ జిల్లా పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం అయింది. సోమవారం తల్లిదండ్రులు వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లారు. భార్య ఇంట్లో ఉండగానే దూలానికి ఉరి వేసుకొని జ్ఞానేశ్వర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆయన మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు.

ఉప్పలవాయి శివారులో..



మహేశ్ (ఫైల్)

రామారెడ్డి: రామారెడ్డి గ్రామానికి చెందిన అమ్ముల మహేశ్(27) సోమవారం రాత్రి ఉప్పల్‌వాయి శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. నిజామాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెంచిర్యాల్‌లో..



నరేశ్ (ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామానికి చెందిన ఏలేటి నరేశ్(44) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై భాస్కరాచారీ తెలిపిన వివరాలు.. నరేశ్ కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి అదుపులోకి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పొలంలో కౌలు రైతు మృతి



బాలాజీ మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ శివారులోని వ్యవసాయ పొలంలో కౌలు రైతు దండాల్‌వార్ బాలాజీ(37)అనే వ్యక్తి మృతి చెందాడు. జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలబత్‌పూర్ గ్రామానికి చెందిన బాలాజీ ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అర్గుల్ శివారులోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిని బాలాజీ కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కాగా ఈ నెల 23న మధ్యాహ్నం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన బాలాజీ ఇంటికి తిరిగి రాలేదు. బాలాజీ తమ్ముడు ప్రకాశ్ వ్యవసాయ పొలం వద్ద వెతకగా అదే రోజు రాత్రి ఎనిమిది గంటల సమయంలో పొలంలో బాలాజీ మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. బాధిత రైతు బొంబోతుల సుదర్శన్‌గౌడ్ తెలిపిన వివరాలు.. రోజూ మాదిరిగా మేతకు వెళ్లిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్‌కు తగిలి మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు హ్యాండిల్ లేకపోవడంతో గతంలో రెండు మేకలు, ఒక గేదె మృతి చెందిందదని ట్రాన్స్‌కో ఏఈకి చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

పర్మళ్లతండాలో ఎద్దు..

లింగంపేట: మండలంలోని పర్మళ్ల తండా శివారులోని పంట చేనుల్లో సోమవారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. పర్మళ్ల తండాకు చెందిన కాట్రోత్ ఫతి ఎద్దు ఉదయం మేతకు వెళ్లగా.. పంట చేనులో ఎల్‌టి లైను కండక్టర్ వైర్లు తెగిపడి ఉన్నాయి. ఎద్దుకు వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌కో అధికారులకు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎద్దు విలువ రూ. 40వేలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

డిచ్‌పల్లి: మండలంలోని ఇస్లాంపుర ప్రాంతానికి చెందిన మహమ్మద్ మక్బూల్ అహ్మద్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆయన కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లగా మక్బూల్ రాత్రి రెండు గంటల ప్రాంతంలో పాల వ్యాపారం కోసం ఇంటికి తాళం వేసి బయటకు వచ్చాడు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని రూ.60 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరి మృతి

బోధన్‌టౌన్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన బోధన్ నుంచి పెంట ఖుర్దు రోడ్డులో గల చిక్క క్యాంప్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. బోధన్‌లోని ఏకచక్రనగర్‌కు చెందిన రావుల రాములు(65) పింఛన్ డబ్బులు తీసుకు రావడానికి భార్య మారమ్మ, కుమారుడు షాదుల్లాతో కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కోటగిరి వెళ్తున్నాడు. చెక్కి క్యాంపు చెందిన గైని రాజన్న వీరి వాహనాన్ని చెక్కి క్యాంపు సమీపంలో ఎదురుగా ఢీకొన్నాడు. ప్రమాదంలో రాములుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు భార్య, కుమారుడికి, గైని రాజన్నకు గాయాలయ్యాయి. గైని రాజన్న అజాగ్రత్తగా, అతివేగంగా బైక్ నడపడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సీఐ వీరయ్య తెలిపారు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కారును ఢీకొన్న లారీ



ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బా ప్రాంతంలో కారును లారీ ఢీకొన్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.